


ఖర్చుపై నిఘా

- అభ్యర్థులకు తెలియకుండానే ఎన్నికల వ్యయంపై ఆరా
- ప్రచారం, ర్యాలీలు, సభలపై వీడియో చిత్రీకరణ
- అసెంబ్లీ నియోజకవర్గానికి మూడు చొప్పున షాడో టీంలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- బ్యాంకు, ఏటీఎం లావాదేవీలపై నజర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికల్లో ధన ప్రభావాన్ని అరికట్టేందుకు ఎన్నికల కమిషన్ అడుగడుగునా నిఘా బృందాలను ఏర్పాటు చేసింది. అభ్యర్థులు చేస్తున్న ప్రచారం సందర్భంగా పెడుతున్న ఖర్చు, ర్యాలీల నిర్వహణ, బహిరంగ సభల నిర్వహణపై, ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై నిఘా పెట్టింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి మూడు షాడో టీంలు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసింది. అభ్యర్థులకు తెలియకుండానే ఎక్కడికక్కడే వీడియో చిత్రీకరణ చేపడుతున్నారు. అభ్యర్థుల బ్యాంకు ఖాతాల జరుగుతున్న లావాదేవీలపై కూడా నజర్ వేసింది. అసెంబ్లీ ఎన్నికల వలే పార్లమెంట్ ఎన్నికలను కూడా పారదర్శకంగా నిర్వహించేందుకు షాడో బృందాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అరికట్టేందుకు షాడో పోలీసులు పనిచేస్తున్నారు. వారు నిత్యం అభ్యర్థుల వెన్నంటే ఉంటారు. ప్రచారానికి సంబంధించి ఖర్చును తక్కువగా చూపినా, షాడో బృందాలు ఇచ్చే సమాచారం ఆధారంగా ఎన్నికల అధికారులు లెక్కలు కట్టనున్నారు. ఈసీ నిబంధనల ప్రకారం ఎంపీ అభ్యర్థి ఎన్నికల సంఘం విధించిన 90 లక్షల రూపాయల పరిమితి లోపే ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనికి విరుద్ధంగా ఖర్చు చేసిన వారి అభ్యర్థిత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ నిబంధనలకు మించి ఖర్చుపెట్టినట్లు తేలితే వారు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు పడుతుందని అధికారులు చెబుతున్నారు. షాడో బృందాలు ప్రధానంగా ప్రచార ఖర్చులపై నిఘా పెడతాయి. వివిధ పార్టీల ర్యాలీలు, సభల నిర్వహణను షాడో బృందాల్లో ఉండే సిబ్బంది చిత్రీకరిస్తారు. వాహనాల సంఖ్య, బ్యానర్లు, ఫ్లెక్సీలతో పాటు ప్రచార సామగ్రి వంటి వివరాలు, ఫొటోలను వెంటవెంటనే ఉన్నతాధికారులకు అందజేస్తారు. అభ్యర్థులకు తెలియకుండానే పని కానిచ్చేస్తారు. అంతేకాకుండా ఇతరుల నుంచి వచ్చే ఫిర్యాదులను బట్టి కూడా అభ్యర్థుల అనుచరుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వీడియో రికార్డు చేస్తారు. ఆయా వ్యక్తులు ఎప్పుడు ఎక్కడకు వెళ్తున్నది. ఎవరితో మాట్లాడుతున్నది వంటి వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేస్తారు.

● నియోజకవర్గానికి ఆరు బృందాలు..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ప్రత్యేక షాడో బృందాలను నియమించారు. ఈ పార్లమెంట్ స్థానంలో పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక నియోజకవర్గానికి మూడు షాడో స్పెషల్ టీంలు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ల చొప్పున నియమించారు. ఒక్కో షాడో బృందంలో సహాయ వ్యయపరిశీలకుడు, ఆదాయపు పన్నుశాఖ అధికారి, పోలీసు అధికారితో పాటు రెవెన్యూ అధికారి ఉంటారు. ఓటర్లను ప్రభావితం చేయకుండా, బెదిరింపులకు పాల్పడకుండా ఎప్పటికప్పుడు ఇలాంటి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే బ్యాంక్ లావాదేవీలపైనా ఎన్నికల అధికారులు నజర్ వేశారు. ప్రధానంగా ఆన్‌లైన్ ద్వారా జరిగే లావాదేవీలపై కన్నేశారు. ఈమేరకు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని సంబంధిత బ్యాంకు అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్లతో సమావేశం నిర్వహించి వారిని అప్రమత్తం చేశారు. ఏకకాలంలో ఎక్కువ మందికి ఒకే ఖాతా నుంచి లావాదేవీలు జరిగినా, ఒకేరోజు ఎక్కువ మొత్తంలో నగదు విత్‌డ్రా చేసుకున్న వారి వివరాలను జిల్లా ఎన్నికల అధికారి, ఆదాయపు పన్ను, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అనుమానాస్పద లావాదేవీలపై ఎప్పటికప్పుడు వివరాలు తెలియజేయాలని, ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ప్రతిరోజూ లావాదేవీల వివరాలు అందజేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏటీఎంల నుంచి నగదు డ్రాచేసే వారిపై కూడా నిఘా పెడుతున్నారు. అదేవిధంగా అభ్యర్థులకు ప్రచార ఖర్చుల వివరాలను రాసేందుకు అభ్యర్థులకు ఈసీ రూపొందించిన ప్రత్యేక నోట్‌బుక్ అందజేయనున్నారు. ఇందులో రోజు వారి ఖర్చు బ్యాంక్ లావాదేవీలతోపాటు పలు వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది.

కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ..

- రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ



మీడియాతో మాట్లాడుతున్న దీపాదాస్ మున్షీ

గోదావరిఖని, ఏప్రిల్ 27: దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. శనివారం గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందన్నారు. తెలంగాణ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎలా పట్టం కట్టారో అదే విధంగా దేశంలో కూడా పట్టం కట్టనున్నట్టు చెప్పారు. దేశంలో రోజు రోజుకు కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆధరణ పెరుగుతుందని, దీనిని చూసి ఓర్వలేక ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్ పార్టీ అనుచిత వాఖ్యలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు అమలవుతున్నాయని, దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను పొందుపర్చినట్టు చెప్పారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలని, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉందన్నారు. ఈ సమావేశంలో ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీకి ఘన స్వాగతం..

మంచిర్యాల జిల్లా పర్యటనకు వెళుతున్న రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి మున్సిపల్ టీ జంక్షన్ వద్ద మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

కార్మిక చట్టాలను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ఆరోపించారు. శనివారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మేడే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986లో పని భద్రత, పనిగంటల తగ్గించాలని చికాగోలో పోరాటం చేసిన అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తోందని, పదేళ్లలో అనేక ప్రభుత్వరంగ సంస్థలను మూసివేసిందని, కాంట్రాక్టు కార్మికులకు పని భద్రత లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనంతో పాటు ఉద్యోగులందరిని రెగ్యులరైజేషన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు బాపు ఐలయ్య, వాయినాల రవి, మల్లేష్, అన్వర్, పుష్ప, రాజేశ్వరి, మౌనిక, సరోజ, స్వప్న, లక్ష్మి, గీత, కొండమ్మ, అంజన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ యజమానులతో కమిషనర్ సమావేశం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 27: వాటర్ ప్లాంట్ల యజమానులతో శనివారం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సమావేశమయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వాటర్ ప్లాంట్ల యజమానులకు పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా వాటర్ ప్లాంట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాటర్ ప్యూరిఫైడ్ చేసిన తర్వాతే ప్రజలకు అందించాలన్నారు. వాటర్‌క్యాన్లు పాకురుతో ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని కాలం చెల్లిన వాటర్ క్యాన్లను వెంటనే మార్చాలని సూచించారు. వేసవి కాలంలో అధిక ధరలకు విక్రయించినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలుచేస్తాం

- ఓడేడు మానేరు బ్రిడ్జి చిన్నగాలికే కొట్టుకుపోయింది - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ముత్తారం ఏప్రిల్ 27: ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలుచేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని మచ్చుపేట గ్రామం బగుళ్ల కమాన్ దగ్గర ఆయన మాట్లాడారు. మాట్లాడుతూ అడవిశ్రీరాంపూర్ నుంచి ఖమ్మంపల్లి వరకు రోడ్డు రూ.3కోట్ల నిధులు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. 6 గ్యారంటీలకు నిదర్శనం ఉచిత బస్సు, సబ్సిడీపై గ్యాస్ కనబడతలేవా అన్నారు. కొంతమంది అభివృద్ధి ఏది అంటున్నారని, బగుళ్లరోడ్డు, సీసీరోడ్లు, 6 గ్యారంటీలలో మూడు గ్యారంటీలు అమలుచేసింది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అభివృద్ధి కార్యాచరణతో ముందుకుపోతున్నామని, కొంతమంది అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారని, వారి కళ్లకు కనిపించేందుకు అభివృద్ధి జరిగిన చోటే ఉండి మాట్లాడుతున్నానని అన్నారు.

ఎన్నికల తరువాత 70ఎంఎంలో అభివృద్ధి చూపిస్తాం..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలే అవుతోందని, ఇప్పటివరకు అభివృద్ధిలో సంక్షేమ పథకాలలో 35 ఎంఎం ట్రయలర్ మాత్రమే చూపించామని, ఎంపీ ఎన్నికల తరువాత 70ఎంఎం అభివృద్ధి సినిమా చూపిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మచ్చుపేట నుంచి బైకు ర్యాలీతో మండల కేంద్రానికి చేరుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. అభివృద్ధి అంటున్నారు.. వారికి మంథని అభివృద్ధి అంటే ఏంటో 70 ఎంఎంలో చూపిస్తానని శ్రీధర్‌బాబు అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ మీద తాము అసత్య ప్రచారాలు చేస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారని, మేడిగడ్డ బ్యారేజీ అలా ఉంటే ఓడేడు మానేరు బ్రిడ్జి చిన్న ఈదురు గాలికి కొట్టుకుపోయిందని అన్నారు. కేసీఆర్‌కు దమ్ముంటే ముత్తారం మండలానికి వచ్చి చూడాలని, వారు చేసిన అవినీతి ఎలా ఉందో తెలుస్తుందన్నారు అనంతరం ఓడేడు మానేరు బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆశీర్వదించి ఆదరించండి..

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కోరారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి వంశీ మాట్లాడారు. తనను గెలిపిస్తే నిరుద్యోగ యువతకు ఎల్లవేళలా అండగా ఉండి వారి ఉపాధి కల్పనకు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్‌మోహన్‌రావు, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, మాజీ సర్పంచులు తూటి రజితరఫీ, బక్కరావు, దొడ్డ గీతారాణి, బియ్యని శివకుమార్, ముస్కుల సురేందర్‌రెడ్డి శశిభూషణ్‌కాచే పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- రామగుండం సీపీ శ్రీనివాస్



హెడ్‌కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఏప్రిల్ 27: పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఆర్మ్‌డ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మల్లయ్య కెనాల్‌లో మునిగి మృతిచెందగా, ఆయన కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా క్రింద రూ.8లక్షలను ఆయన భార్య హేమలత, కుమార్తె శ్రీజలకు, గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గుండె పోటుతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ సోమరాజు భార్య శోభరాణికి, కుమార్తె సాయి ప్రియకు రూ.15.99 లక్షలను శనివారం సీపీ కార్యాలయంలో చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కుటుంబాలకు పోలీస్‌శాఖ ఎప్పటికీ అండగా ఉంటుందని, ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్స్‌ను తక్షణమే అందజేస్తామని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది, కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుని వారి అండగా ఉంటామన్నారు. మృతిచెందిన హెడ్‌కానిస్టేబుళ్ల కుటుంబాల స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేందర్, ఏవో అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ సంధ్య ఉన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం



రాములపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న విజయరమణారావు

ఎలిగేడు, ఏప్రిల్ 27 : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సబ్బండ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం మండలంలోని రాములపల్లిలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్వర్గీయ వెంకటస్వామి మనుమడు గడ్డం వివేకానంద కుమారుడు వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, గ్రామచెరువులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి చేతి గుర్తుకు ఓటు వేయాలని మరోసారి చెప్పారు. పదేళ్ల అధికారం అనుభవించిన నరేంద్రమోడీ, రాష్ట్రం బీఆర్ఎస్ ప్రభుత్వాల ప్రజలకు ఏమి చేయలేదని ఆరోపించారు. మరోసారి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన 6హామీలలో ఐదింటిని నెరవేర్చమని, ఆగస్టు 15 వరకు రాష్ట్రంలో ఉన్న రైతులకు రూ.లక్షలు రుణమాఫీ చేసి వారి చిరకాల వాంఛ నెరవేర్చుతామని పేర్కొన్నారు. ఆయనతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, గోడెల శ్రీనివాస్‌రెడ్డి, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, పోట్యాల రమేష్, వెంకటరెడ్డి, సిద్ది తిరుపతి, నరేష్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించవద్దు..

ఇందిరమ్మ ఇళ్లు ఇప్పి స్తామని ఎవరైనా దళారులు మీ వద్దకు వచ్చి డబ్బులు అడిగితే ఇవ్వవద్దని, పైరవీకారులను ఆశ్రయించినా, వారికి డబ్బులు ఇచ్చినా ఇళ్లు రావని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని నారాయణపూర్, కొదురుపాక, దేవునిపల్లి తదితర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఎమ్మెల్యే శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలోని చెరువులు కుంటల వద్ద ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల వద్ద మహిళా కూలీలతో మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి రావడం, ప్రధానిగా రాహుల్ గాంధీ ఉండడం వలన పేదలకు న్యాయం జరుగుతుందని అనేక సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. పెద్దపల్లి ప్రాంత అభివృద్ధి ధ్యేయంగా, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఎన్నికల బరిలో వంశీ నిలిచారని, భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాగర్‌రావు, నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, పన్నాల రాములు, ప్రకాశ్‌రావు, దామోదర్‌రావు, సాయిరి మహేందర్, పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తాము ఇబ్బంది పడుతున్నామని పలువురు మహిళలు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. దాంతో ఆయన అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఎట్టకేలకు ప్రారంభమైన రైల్వే ఓవర్ బ్రిడ్జి

- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

పాలకుర్తి, ఏప్రిల్ 27: బసంత్‌నగర్ సమీపంలో కొన్నేళ్లుగా ఎదురుచూసిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ఎట్టకేలకు శనివారంతో ముగిసి తాత్కలికంగా రాకపోకలకు అనుమతులు లభించడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సింగిల్ లైన్ రోడ్డు ఉండడంతో తరచుగా పలు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడడంతోపాటు గాయాల పాలైన సంఘటనలు ఉన్నాయి. నిత్యం అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రైల్వే బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగనుండడంతో ప్రమాదాలు తగ్గి రాకపోకలకు సులువుగా మారిందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సోదరుల మధ్య ఘర్షణ .. తమ్ముడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో శనివారం ఇద్దరు సోదరులు ఘర్షణ పడగా తమ్ముడు కాల్వ వెంకటేష్‌యాదవ్(28) మృతి చెందాడు. గ్రామస్థులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కాల్వ వెంకటేష్, కాల్వ శ్రీనివాస్‌లు అన్నదమ్ములు. మద్యానికి బానిసైన ఇద్దరు సోదరులు ఎలాంటి పనులు చేయకుండా తరచుగా గొడవపడుతుంటారు. వారి తండ్రి రాయమల్లు గొర్లకాపరిగా పనిచేస్తుంటాడు. శనివారం సాయంత్రం అన్నదమ్ముల మధ్య గొడవ జరగ్గా శ్రీనివాస్ ఇంటిలోని ఈలపీటతో వెంకటేష్ నడుం భాగంలో కొట్టాడు. దీంతో ఆగ్రహంతో శ్రీనివాస్‌ను వెంకటేష్ కొట్టేందుకు రాగా అతన్ని నెట్టివేయడంతో భవనం పిల్లర్‌కు తల తగిలింది. దీంతో వెంకటేష్ చెవుల నుంచి రక్తం కారి కొద్దిసేపటికి మరణించాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

760 లీటర్ల మద్యం సీజ్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 27: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలలో బెల్ట్ షాప్‌లపై దాడులుచేసి రూ. 4.60 లక్షల విలువైన 760 లీటర్ల మద్యంను సీజ్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించిన 96 మందిపై కేసులు నమోదుచేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాప్ యజమానులు బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ 109 మందిపై కేసులు నమోదు చేసి రూ .5.17లక్షల విలువైన 957 లీటర్ల మద్యం సీజ్‌చేశామన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్‌లు, కిరాణ దుకాణాల్లో, ఇతర ఇళ్లల్లోనూ ఎవరైనా బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కారు ఢీకొని దుప్పి మృతి

కథలాపూర్, ఏప్రిల్ 27: మండలంలోని దుంపెట శివారులో వరద కాలువ వద్ద శనివారం కారు ఢీకొట్టిన ఘటనలో చుక్కల దుప్పి మృతి చెందింది. సెక్షన్ అధికారి మల్లేశం కథనం ప్రకారం.. చింతకుంటకు చెందిన అనుప రాజేశ్ టీఎస్ 21 సీ 8991 నంబర్ గల కారులో తన స్వగ్రామం వెళ్తుండగా అటువైపు నుంచి వేగంగా వచ్చిన దుప్పిని ఢీకొట్టాడు. గాయాల పాలై అపస్మారక స్థితికి చేరిన దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. కారును సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు సెక్షన్ అధికారి తెలిపారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27: ధాన్యం కుప్పలను బైక్ ఢీకొన్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన వ్యక్తి ఎర్పుల రాములు తీవ్ర గాయాలపాలయ్యాడని సీఐ శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. రోడ్డుపై ధాన్యం కుప్పలు పోసి ప్రమాదానికి కారణమైన కిష్టునాయక్‌తండాలోని రైతు భూక్య నరేశ్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. రాములు తన ద్విచక్ర వాహనంపై ఈ నెల 26న సాయంత్రం గొల్లపల్లికి వెళ్లి రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో రహదారిపై ఉన్న ధాన్యం కుప్పలను ఢీకొట్టాడని చెప్పారు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని వివరించారు. బాధితుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు రోడ్డుకు అడ్డుగా ధాన్యం కుప్పలు పోసిన రైతు నరేశ్‌పై ఎస్ఐ రమాకాంత్ కేసు నమోదు చేయగా దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పేర్కొన్నారు.

● ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్- కోరుట్లపేట గ్రామ శివారులోని రహదారిపై ఉన్న వరి ధాన్యం కుప్పను ద్విచక్రవాహనంతో శనివారం రాత్రి ఢీకొన్న సంఘటనలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రాజనర్సు తీవ్ర గాయాలపాలయ్యాడు.

జగిత్యాలలో రెండిళ్లలో చోరీ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 27: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న ఆదర్శనగర్‌లో రెండిళ్లలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఆదర్శనగర్‌కు చెందిన శేఖర్‌రెడ్డి, కోటి అనే ఇద్దరు వ్యక్తులకు చెందిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.61 వేల నగదును అపహరించుకవెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించి వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, ఏప్రిల్ 27: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ నెల 24న రాత్రి గ్రామంలో హరీష్ అనే వ్యక్తి తన బంధువులతో సహా డ్యాన్స్ చేస్తుండగా అటువైపుగా వెళ్లిన మ్యాకల ఉదయ్ అనే వ్యక్తిని ఆపి చేతులతో కొట్టి, కులం పేరుతో దూషించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఉదయ్ ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ రావు శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సాక్షులను విచారించారు.

కంబోడియా కేంద్రంగా సైబర్ మోసాలు

● చైనీస్ కంపెనీ పేరిట కాల్ సెంటర్ ● ఇద్దరి ఏజెంట్ల అరెస్టు, మరో ఇద్దరికి లుక్ అవుట్ నోటీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 27: కంబోడియా కేంద్రంగా చైనీస్ కంపెనీ పేరిట సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠా వ్యవహారాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు గుట్టురట్టు చేశారు. ఇద్దరు ఏజెంట్ల అరెస్ట్ చేసి మరో ఇద్దరికి లుకౌట్ నోటీసులు జారీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మి తన కుమారుడు శివప్రసాద్‌ను గల్ఫ్ పంపేందుకు జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన కంచర్ల సాయిప్రసాద్ అనే ఏజెంట్‌ను కలిసింది. ఇందుకోసం రూ.1.40 లక్షలు ఇచ్చింది. ఏడాది క్రితం శివప్రసాద్‌ను కంబోడియా పంపించిన ఏజెంట్ సైబర్ మోసాలకు పాల్పడే కాల్‌సెంటర్‌లో పని ఇప్పించాడు. ఇండియాకు చెందిన ఫోన్ నంబర్లకు కాల్ చేసి సైబర్ మోసం చేయమంటూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని శివప్రసాద్ తన తల్లి ద్వారా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చాడు. లక్ష్మి ఫిర్యాదుతో సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. చైనీస్‌కు చెందిన కంపెనీలో శివప్రసాద్ పాస్‌పోర్ట్ తీసుకున్నట్లు, సైబర్ నేరాలు చేయిస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతడితోపాటు ఇండియాకు చెందిన 600 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెంటనే కంబోడియాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడినట్లు, బాధితుడి వివరాలు పంపించి అక్కడి పోలీసుల సహాయంతో రెస్క్యూ చేసి శివప్రసాద్‌ను కాపాడినట్లు ఎస్పీ చెప్పారు. శివప్రసాద్ రెండు రోజుల్లో సిరిసిల్లకు చేరుకుంటాడని, మిగతా బాధితులను ఇండియాకు పంపించే ఏర్పాట్లు చేశామని ఎస్పీ వివరించారు.

ఉపాధి పేరిట సైబర్ మోసాలకు పాల్పడే కాల్ సెంటర్‌లో ఉద్యోగం పెట్టించి మోసం చేసిన ఏజెంట్లు జగిత్యాల జిల్లా కొడిమ్యాల గ్రామానికి చెందిన కంచర్ల సాయిప్రసాద్, మహారాష్ట్రలోని పూణేకు చెందిన అబిద్ అన్సరీని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు ఏజెంట్లకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

● కమీషన్‌ల కోసం ఏజెంట్ల దందా

కమీషన్‌ల కోసం ఏజెంట్లు దందాకు పాల్పడుతున్నట్లు తేలింది. కంబోడియా ఏజెంట్‌గా పనిచేసిన సాయిప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. బాధితుడు ఇచ్చిన మొత్తంలో సాయిప్రసాద్ రూ.10వేల కమీషన్ తీసుకొని లక్నోకి చెందిన సదాకత్ అనే వ్యక్తికి పంపిస్తాడు. ప్రస్తుతం మాల్దీవ్స్‌లో ఉంటున్న సదాకత్ రూ.10వేల కమీషన్ తీసుకొని పూణేకు చెందిన అబిద్ అన్సరీకి పంపిస్తాడు. అతను దుబాయ్‌లో ఉంటున్న బీహార్‌కు చెందిన షాదబ్ అనే వ్యక్తికి మిగిలిన మొత్తంతో పాటు, పాస్‌పోర్టు పంపిస్తే కంబోడియా దేశానికి పంపించే ఏర్పాట్లు చేస్తాడని విచారణలో వెల్లడైనట్లు ఎస్పీ చెప్పారు. దీంతో కంచర్ల సాయిప్రసాద్, అబిద్ అన్సరీ అనే ఏజెంట్లను అరెస్ట్ చేశామని, సాయిప్రసాద్‌ను కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. అబిద్ అన్సరీకి నోటీసులు ఇచ్చి పంపామని, పరారీలో ఉన్న మిగతా ఇద్దరు ఏజెంట్లకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. గల్ఫ్ ఉద్యోగాల పేరిట ఏజెంట్ల చేతిలో మోసపోతే వెంటనే 8712656411కు ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు నిధి ఆప్కే నికత్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం, ఈఎస్ఐసీ సంయుక్తంగా ఈనెల 29న ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు నిధి ఆప్కే నికత్-2 (పీఎఫ్ మీ ముంగిట) జిల్లా అవగాహన శిబిరం, ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నట్లు ప్రావిడెంట్ ఫండ్ ప్రాంతీయ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగునూరు ప్రతిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్)లో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాకు సంబంధించి సుల్తానాబాద్ రఘురామ్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో, జగిత్యాల జిల్లా కోరుట్ల మోసాక్ బీడీ వర్క్స్‌లో, రాజన్న సిరిసిల్ల జిల్లాకు సంబంధించి తంగళ్లపల్లి ఠాకూర్ వైఎస్ బీడీ వర్క్స్‌లో, మంచిర్యాలలో కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో, ఆసిఫాబాద్ జిల్లాకు సంబంధించి సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో, ఆదిలాబాద్‌లో నలంద డిగ్రీ కళాశాలలో, నిర్మల్‌లో ఎస్‌టి థామస్ స్కూల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెన్షనర్లు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

వరిపంట దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 27: మండలంలోని మల్యాల గ్రామ శివారులో ఆ గ్రామానికి చెందిన రైతు పంజాల శంకరయ్య కోతకొచ్చిన ఎకరంన్నర వరి శనివారం అగ్నికి ఆహుతి అయింది. పొలం దగ్ధమై సుమారు లక్ష రూపాయల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు. వరి పొలం ప్రమాదవశాత్తు కాలిందా ఎవరైనా అంటు పెట్టారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కక్షతోనే వరి పంటకు నష్టం చేశారని బాధితుడు తెలిపారు.

నగదు స్వాధీనం

పాలకుర్తి, ఏప్రిల్ 27: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి అడ్డరోడ్డు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా 2,41,760 రూపాయల నగదు పట్టుకున్నట్లు ఎస్సై ఆర్ స్వామి తెలిపారు. జిల్లాలోని జూలపల్లి మండల కేంద్రానికి చెందిన మల్లారపు శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద లక్ష రూపాయలు, మంచిర్యాల జిల్లా భీమారం గ్రామానికి చెందిన తాళ్ల సతీష్‌కుమార్ అనే వ్యక్తి వద్ద 61 వెయ్యి 760 రూపాయలు, అదే గ్రామానికి చెందిన ఎడ్ల గణేష్ వద్ద 80 వేల రూపాయలను సరైన ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అందించినట్లు ఎస్సై తెలిపారు.

● ఇల్లందకుంట : మండలంలోని సిరిసేడు గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న రూ.1.50లక్షలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా సిద్దిపేటకు చెందిన పృథ్వీరాజ్ అనే అతను ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బులు తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్లు సీఐ కిశోర్ పేర్కొన్నారు. ఎస్ఐ రాజకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

వీణవంక, ఏప్రిల్27: మండలంలోని బేతిగల్‌లో చొప్పరి తిరుపతి అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 2,400 రూపాయల విలువ చేసే బ్రాందీ, విస్కీ పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నేతన్నలను పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్

● పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ

సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేండ్లు పరిపాలించినా పవర్‌లూం నేత కార్మికులు, పద్మశాలి సమాజాన్ని పట్టించుకోలేదని, రెండు పార్టీలు శవ రాజకీయాలు చేస్తున్నాయని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడ్డ వార్పిన్ కార్మికుడు అడిచెర్ల సాయి, తంగళ్లపల్లిలో అంకారపు మల్లేశం కుటుంబాలను, కాంగ్రెస్ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పది సంవత్సరాలు పరిపాలించిన కేసీఆర్, సిరిసిల్లకు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కేటీఆర్ సిరిసిల్ల నేత కార్మికులు, పద్మశాలి సమాజానికి ఏమీ చేయలేదని అన్నారు. బీజేపీ వస్త్ర పరిశ్రమకు 12 శాతం జీఎస్టీ వేసిందని అన్నారు. 26 వేల మరమగ్గాలపై పేద నేత కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ ఆర్డర్లకు సంబంధించి రూ.275 కోట్ల బకాయిల బిల్లులు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చెల్లించే ప్రయత్నం చేస్తుందని అన్నారు.ఎలక్షన్ కోడ్ ముగిసిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం పవర్‌లూం పరిశ్రమ కోసం కొత్త పాలసీ తీసుకవస్తుందని అన్నారు.

పొలిమేర వరకు తరిమికొడతాం : మంత్రి పొన్నం

శవ రాజకీయాలు చేస్తూ పది సంవత్సరాలు అధికారంలో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే పరిస్థితి వస్తే తప్పులు, అప్పులు చేసిన వారిని పొలిమేర వరకు తరిమికొడతామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిరిసిల్లలో ఆత్మహత్యలు దురదృష్టకరమని అన్నారు. గత ప్రభుత్వంకు కేవలం బతుకమ్మ చీరలపై ధ్యాసే ఉండేదని కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 1 ద్వారా బట్ట ఆర్డర్లు తెలంగాణ వ్యాప్తంగా ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, అకునూరి బాలరాజు, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్యశివప్రసాద్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల బాలయ్య దీపదాస్‌కు వినతిపత్రం అందించారు.


తంగళ్లపల్లిలో కార్మిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న దీపదాస్ మున్షీ

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అవినీతిమయం

● గంగాధరలో ఏసీబీకి చిక్కిన ఎస్ఆర్‌వో

● గతంలో స్టాంపుల కుంభకోణంలో సస్పెండ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27 : స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో లంచాలు లేనిదే ఏ ఫైల్ కదలడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ కార్యాలయాలు అవినీతిమయంగా మారాయి. ఇళ్లు, ఇంటిస్థలాలు, భూములు, మార్టిగేజ్, తదితర రిజిస్ట్రేషన్‌లు జరగాలంటే అధికారులకు లంచాలు ముట్టాల్సిందే. తాజాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కరీంనగర్ డీఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శివారపు సురేష్‌బాబు నెల రోజుల కిందటే గంగాధర ఇంచార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా వెళ్లి శనివారం కార్యాలయం అటెండర్ కొత్తకొండ శ్రీధర్ ద్వారా 10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. గతంలో సురేష్‌బాబు స్టాంపుల కుంభకోణంలో నిందితుడిగా ఉండి ఒకసారి సస్పెండ్‌కు కూడా గురయ్యాడు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పురాలేదని విమర్శలు వస్తున్నాయి.

● ఎస్ఆర్‌వో సురేష్‌బాబు ఇంటిలో ఏసీబీ సోదాలు

లంచం డబ్బులు తీసుకుంటూ ఏసీబీ పోలీసులకు పట్టుబడిన ఎస్ఆర్‌ఓ సురేష్‌బాబును గంగాధరలో కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ పోలీసులు కరీంనగర్ మంకమ్మతోటలోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించి 12 లక్షల 30 వేల నగదుతోపాటు 350 గ్రాముల బంగారు ఆభరణాలను, ఇతర కీలక డాక్యుమెంట్లు సీజ్ చేశారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న ఎస్ఆర్‌ఓ సురేష్‌బాబు, కొత్తకొండ శ్రీధర్‌లను ఆదివారం కరీంనగర్ ఏసీబీ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరుస్తామని కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి తెలిపారు.

● స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ, ఆర్టీఏ, అటవీశాఖతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఇదే విధంగా ప్రభుత్వ అధికారులు వారి కార్యాలయాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్స్, కాంటాక్టు ఉద్యోగులతో లంచాలు డబ్బులు తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖకు పట్టుబడ్డారు. లంచం డబ్బులు తీసుకుంటూ ఇటు ఉద్యోగం, అటు కోర్టు కేసులతో ఆర్థికంగా నష్టపోతున్నారు.


ఎస్ఆర్‌ఓ సురేష్‌బాబు ఇంటిలో సోదాలు చేస్తున్న ఏసీబీ పోలీసులు

బావిలో పడి వృద్ధురాలి మృతి

మానకొండూర్, ఏప్రిల్ 27: మానకొండూర్ గ్రామానికి చెందిన బొల్లం శివమ్మ (85) అనే వృద్ధురాలు శనివారం బావిలో పడి మృతి చెందింది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శివమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయింది. శనివారం శివమ్మ తన రెండో కుమారుడు బొల్లం శంకర్ ఇంటిలోని చేద బావిలో పడి ఉండడాన్ని కుటుంబీకులు గమనించారు. బావిలో నుంచి బయటికి తీయగా అప్పటికే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి శనివారం జైలు శిక్ష విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 25 మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపరచగా అందులో ఒక వ్యక్తికి 7 రోజులు, మరో వ్యక్తికి 5 రోజులు, ఆరుగురు వ్యక్తులకు 3 రోజుల వంతున జైలుశిక్షతో పాటు మొత్తం 16,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 17 మందికి 25 వేల రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు.

ఖనిలో రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: రాష్ట్ర స్థాయి సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు గోదావరిఖని వేదికైంది. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన ఈ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు జరుగనున్నది. ఈ టోర్నమెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొనున్నాయి. 10వ సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్‌ను సింగరేణి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌ల్లో నిజామాబాద్, వరంగల్ జట్లు తొలి మ్యాచ్‌లో పోటీపడగా నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో వనపర్తి, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో వనపర్తి జట్టు విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరుగగా డ్రాగా ముగిసింది. 5వ మ్యాచ్ రంగారెడ్డి, మెదక్ జట్లు మధ్య జరిగి న మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. 6వ మ్యాచ్‌లో వరంగల్, కరీంనగర్ జట్లు తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్ నల్గొండ, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు గెలుపొందింది.

ఈ టోర్నమెంట్‌లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి గణపతి, వైస్ ప్రెసిడెంట్ ఆర్‌పి నాయుడు, కోశాధికారి సామాల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌తో పాటు పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

● పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా తాగునీరు సరఫరా చేయాలని అందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మిషన్‌భగీరథ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. శనివారం జిల్లాలోని రుద్రవరం ఇంటెక్‌వెల్, అగ్రహారం నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోనీటి నిల్వ పూర్తి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 5.90 టీఎంసీలకు తగ్గడం వల్ల వేసవిలో మిషన్‌భగీరథ నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. మిషన్ భగీరథ నీటి అవసరాలు, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి లభ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు మూడు నెలలకు 0.36 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని ప్రస్తుతం 4 టీఎంసీల వరకు నీటి లభ్యత ఉందని వివరించారు. ప్రతి గ్రామానికి అవసరమైన మేరకు సమృద్ధిగా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, మిషన్‌భగీరథ సీఈ అమరేంద్ర, ఎస్ఈ రవీందర్, ఈఈలు విజయ్‌కుమార్, జానకి తదితరులు ఉన్నారు.


నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సందీప్ కుమార్ సుల్తానియా

రాజన్న సేవలో సందీప్ కుమార్ సుల్తానియా

వేములవాడ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శనివారం దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ గౌతమిలతో కలిసి ఆయన శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనము గావించారు.

వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్27: కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామ పరిధిలో ఓ వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి శనివారం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు 30నుంచి 40సంవత్సరాల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన దశలో ఉందని, మృతుడు నలుపురంగు పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు ఎలగందుల గ్రామ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఏప్రిల్27: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణ పతి ఆలయంలో వేదపండితులు పూజలు నిర్వహించారు.



క్యూలైన్‌లో భక్తులు

లక్ష్మీనగర్‌లో కుక్కల స్వైర విహారం

● ఆరుగురు చిన్నారులపై దాడి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: గోదావరిఖనిలో పిచ్చి కుక్కల స్వైర విహారం ఆగడం లేదు. వారం రోజుల క్రితం మార్కండేయకాలనీలో ఎనిమిది మందిపై దాడి చేయగా శనివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లో పిచ్చి కుక్కలు ఆరుగురు చిన్నారులపై దాడికి పాల్పడ్డాయి. ప్రహన్య, చక్రిశ్రీ, నిత్య మరో ముగ్గురు చిన్నారులు ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. గాయాలపాలైన చిన్నారులను గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రాత్రివేళల్లో కుక్కలు నడిచి వెళ్లేవారిపై, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతున్నాయి. గత ఏడాది ఎల్‌బీనగర్‌లో కుక్కలు మోటార్ సైకిల్‌పై వెళుతున్న హమాలీని వెంబడించగా వాహనం అదుపు తప్పి కార్మికుడు మృతి చెందాడు. అయినా కార్పొరేషన్ అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. గుంపులు గుంపులుగా కోతులు, కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ఫైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 27: సత్యసాయి సేవా సమితి సభ్యులు స్థానిక చిరు వ్యాపారులకు శనివారం గొడుగులను పంపిణీ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్ల పక్కన అమ్మకాలు జరిపే చిన్న వ్యాపారులకు నీడ నిచ్చేలా గొడుగులను అందజేశారు. ఈకార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు నూక రమేష్, అనంతుల రాజు, రాజమహేందర్‌రెడ్డి, బుగ్గాజీ, లక్ష్మీనారాయణ, కిష్టయ్య, లక్ష్మన్, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

ఓదెల : మండలంలోని కొలనూర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కన్నెబోయిన ఓదెలు, మనవడు విరాజ్ జన్మదినం సందర్భంగా 40 మంది వృద్ధులకు శనివారం ఓదెలు గొడుగులు, టవాళ్లు అందజేశారు. అలాగే అనంతరం వృద్ధులకు తన ఇంటి వద్ద లడ్డూలను అందజేశారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 27 : గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీవో సుదర్శన్ అన్నారు. మండలంలోని అందుగులపల్లి, రాగినేడు, కాపులపల్లి, గోపయ్యపల్లి, పాలితం గ్రామాల్లో మండల పరిషత్ అధికారి సుదర్శన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధు తాగునీటి సరఫరాల చేసే ప్రాంతాలను పరిశీలించారు. తాగునీటి సరఫరా కోసం నిధులున్నాయని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

బెంచీల ఏర్పాటు

రామగిరి, ఏప్రిల్ 27: మండలంలోని కల్వచర్ల పంచాయతీ పరిధిలోని శ్మశానవాటిక వద్ద ప్రజల సౌకర్యం కోసం రేండ్ల వెంకటయ్య స్మారకార్థం తన సొంత ఖర్చులు రూ.15 వేలతో 5 సిమెంట్ బెంచ్‌లను సింగరేణి కార్మిక కుటుంబం రేండ్ల శారద-కుమారస్వామి దంపతులు ఏర్పాటు చేపట్టారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమా కార్యక్రమాలను చేపడతామని దంపతులు తెలిపారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

పాలకుర్తి,ఏప్రిల్ 27:మండలం లోని జయ్యారం తదితర గ్రామాల్లో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఆశవర్కర్లు ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ద్రావణం తాగాలన్నారు.

బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు

రామగిరి, ఏప్రిల్ 27: మండలంలోని కల్వచర్లలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం బస్టాండ్ సమీపంలో జెండాను ఆవిష్కరించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు జాపతి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నాయకులు బొంకూరి పోచం, రేండ్లకుమారస్వామి, కిష్టయ్య, దాసరి సంపత్, ఆసంప్రభాకర్, బూడిదరాము, కన్నూరి ఓదెలు, ఆసం నర్సయ్య పాల్గొన్నారు.

'కొప్పుల' గెలుపు కోసం ప్రచారం

ధర్మారం, ఏప్రిల్27: పెద్దపల్లి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల గెలుపు కోసం శనివారం ధర్మారం మండలం రామయ్యపల్ల, రచ్చపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేయాలని వారు అభ్యర్థించారు. ప్రచారంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు మోహన్ రెడ్డి, జితెందర్‌రావు, వెంకటొరెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

కమాన్‌పూర్, ఏప్రిల్ 27 : పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచార కమిటీ సభ్యులు కోరారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ రాచకొండ లక్ష్మీరవి, వైస్‌ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ మేకల సంపత్‌యాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ బాద్రపు మల్లేష్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ సర్పంచులు తాటికొండ శంకర్, కొండ వెంకటేష్, ఆకుల గట్టయ్య తదితరులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ

ఓదెల, ఏప్రిల్ 27 : మండలంలోని పోలింగ్ బూత్‌లను శనివారం పార్లమెంట్ సెగ్మెంట్ ఏఆర్‌వో గంగయ్య తనిఖీ నిర్వహించారు. మండలంలోని 40 పోలింగ్ స్టేషన్లలో ఫ్యాన్లు, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించారు. అలాగే విద్యుత్ సౌకర్యం ఏర్పాటులో జాప్యం చేయవద్దని, మౌలిక సౌకర్యాల ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వెంట తహసీల్దార్ యాకయ్య, ఆర్ఐలు రాజేందర్, నర్సింగం ఇతర సిబ్బంది ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్



పెద్దకల్వలలో కూలీలతో మాట్లాడుతున్న రవిందర్ రాథోడ్

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 27 : వేసవి కాలం దృష్ట్యా ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి రవిందర్ రాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దకల్వలలోని చెరువులో ఉపాధిహామీ పథకంలో భాగంగా పూడికతీత పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ పరిశీలించారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఉదయం 6గంటల నుండి 10 గంటల వరకు పనులు నిర్వహించాలని, తాగునీరు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మహిళలు, వృద్ధులు, యువకులు పనులు చేస్తున్న సమయంలో తలకు తప్పనిసరిగా టోపీ, టవల్ ధరించాలన్నారు. దాహం అయిన కాకపోయిన తాగునీరు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకేట్‌లు తప్పనిసరిగా తాగాలని సూచించారు. వడగాపులు అధికమవుతున్నాయని , పని సమయంలో కొంతసేపు నీడకు విశ్రాంతి తీసుకుంటూ పనులు చేయాలన్నారు. అలాగే పెద్దబొంకూర్‌లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని , పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు.

వెంట ఏపీవో రమేష్ బాబు, ఏపిఎం సంపత్, పంచాయితి రాజ్ ఏఈ రవిందర్, పంచాయితి కార్యదర్శులు రణధీర్, స్వప్న, ఈజీఎస్ జేఈ రాజయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

ఎలిగేడు, ఏప్రిల్ 27 : ఎలిగేడు, ధూళికట్ట, వడ్కాపూర్, వెంకట్రావుపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలని అదనపు కలెక్టర్ జీవి.శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని రిజిష్టర్లను, రసీదులను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే నమోదు చేసి మిల్లులకు తరలించాలని, రైస్‌మిల్లుల వద్ద ధాన్యం కోత లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ జీవి.శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ధాన్యాన్ని శుభ్రపరుచుకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పాడీ క్లీనర్ల ను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ జీవి. శ్యామ్ ప్రసాద్ లాల్ సూచించారు.

ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జూలపల్లి ఎలిగేడు తహసీల్దార్ స్వర్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయక స్వామి రథోత్సవం

సుల్తానాబాద్, ఏప్రిల్ 27: మండలంలోని నీరుకుళ్ల మానేటి రంగనయాకస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. శనివారం సాయంత్రం మానేరు నదిలో స్వామివారి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. అనంతరం రాత్రి నాగవెల్లి కార్యక్రమం జరుగగా, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుప్రకాష్‌రావు, అన్నయ్యగౌడ్, సాయిరి మహేందర్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎలిగేడు, ఏప్రిల్ 27 : మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్(47)కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. శ్రీనివాస్ తాగుడుకు బానిసై ఈనెల 20న ఇంటివద్ద పడిపోవడంతో వెన్నుముకకు దెబ్బతగిలింది. దీంతో మెడ నరాలు చిట్లి శనివారం మృతిచెందాడు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలి : కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కోల్‌సిటీ, ఏప్రిల్ 27: భూగర్భ జల మట్టం పెరగడానికి ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు క్షీణించి పోయి ప్రమాద స్థాయి చేరుకోకముందే అప్రమత్తం కావాలని సూచించారు. ఇంకుడు గుంత నిర్మించుకోవడం వలన వ్యర్థమైన నీరు భూమిలోకి ఇంకి పరిసరాలు కలుషితం కాకుండా ఉంటాయని, మరో కొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో పాత ఇంకుడు గుంతలను పునరుద్ధరించడంతో పాటు వాన నీటి సంరక్షణ కొరకు మరికొన్ని చోట్ల సామూహిక ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. నూతన పురపాలక చట్టం 2019 ప్రకారం ఇంకుడు గుంత నిర్మాణం చేసేలా ఇంటి ప్లాన్ ఉంటేనే భవన నిర్మాణ అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలలో ఇంకుడు గుంత ఉంటేనే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంకుడుగుంత ఉన్న ఇండ్లు, అపార్ట్మెంట్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, తదితర భవనాలను జియో టాగింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టేలా ప్రజల్లో అవగాహన కల్పించడానికి విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత ఇల్లు ఉన్న మున్సిపల్ సిబ్బంది తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని అన్నారు. అలాగే ప్రస్తుత నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు నీరు వృధా చేయకుండా పొదుపుగా వాడాలని కోరారు. సొంత బోర్లు, బావులు ఉన్నవారు కూడా పైపుల ద్వారా ఇంటి ముందు వాకిళ్ళు , రోడ్లపై అధిక నీరు వృధా చేయకుండా బకెట్‌లతో చల్లుతూ పొదుపుగా వాడాలని కోరారు. ఈ అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్ త్రియంబకేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్ కోరారు. శనివారం గోదావరిఖనిలోని 81, 82 పోలింగ్ బూత్ సీఎస్‌పీ, ఆర్‌సీఓఏ క్లబ్ ఏరియాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానిగా చేయాలని, దేశంలో పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, బ్రహ్మం, మాతంగి రేణుక, కొమ్ము శ్రీనివాస్, మామిడి సంపత్, రాజేష్,రవి, వేణు, సదానందం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ప్రచారం చేశారు. మండలంలోని తుర్కలమద్దికుంటలో ఉపాధిహామీ భాగంగా పని ప్రాంతానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, మండల బీజేవైఎం అధ్యక్షుడు మామిడి ఉమేష్, కందుల రాజేందర్, బూత్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, తనుకుట్లస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జికి సన్మానం

సుల్తానాబాద్, ఏప్రిల్ 27: సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక హైదరాబాద్ మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి రెండవ అదనపు 13వ మెట్రోపాలిటన్ కోర్టుకు బదిలీ వెళుతున్న సందర్భంగా శనివారం రాత్రి కోర్టు అవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. బార్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో జడ్జి ప్రియాంక మాట్లాడుతు లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలకు సమన్యాయం అందించి కేసులను పరిష్కరించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. పలువురు సీనియర్ సీనియర్ న్యాయవాదులు బార్ అసోసియేషన్ ప్రతినిదులు బదిలీపై వెలుతున్న జడ్జి ప్రియాంకను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో బార్ కార్యదర్శి జోగుల రమేష్, ఏపీపీ శ్యామ్ సుందర్ రావు, ఏజీపీ మేకల తిరుపతిరెడ్డి, న్యాయ వాదులు టీకే సత్యనారాయణ, ఆవుల లక్ష్మి రాజం యాదవ్, పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, భూసారపు బాలకిషన్ ప్రసాద్, మాదూరి అంజనేయులు, వొడ్నాల రవీందర్, శ్యాంసుందర్, సత్యనారాయణ, కోడమ్ అజయ్, అంజనేయులు, భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, శివకృష్ణ, ఆనంద్, సంతోష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



బేస్‌వర్క్‌షాప్‌ను సందర్శించిన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఫైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 27: ఓసీపీ-3 బేస్‌వర్క్‌షాప్‌ను శనివారం ఐఎన్‌టీయూసీ నాయకులు సందర్శించారు. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి కార్మికులను అడిగి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. బేస్‌వర్క్‌షాప్‌లో నెలకొన్న పలు సమస్యలను కార్మికులు ఆయనకు వివరించారు. యూనియన్ పక్షాన అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జీఎల్‌బీకేఎస్ నుంచి బహిష్కరణ

ఫైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 27: గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం నుండి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కే విశ్వనాథ్‌ను బహిష్కరిస్తున్నట్టు యూనియన్ జనరల్ సెక్రెటరీ జే సీతారామయ్య ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25న జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో విశ్వనాథ్‌ను బహిష్కరించాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. యూనియన్ నిబంధనావళికి వ్యతిరేకంగా నడుచుకోవడేమే కాకుండా క్రమశిక్షణా రాహిత్యంగా వ్యహరించినందుకు బహిష్కరణ నిర్ణయాన్ని రాష్ట్ర కమిటీ తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు

కాసిపేట, ఏప్రిల్ 27: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తమ్మల రాజిరెడ్డి అన్నారు. శనివారం కాసిపేట 2వ గనిలో నిర్వహించిన సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొంత కాలంగా కాసిపేట 2వగనిలో అధికారుల వేధింపులు ఎక్కువ య్యాయని, ఇది సరైంది కాదన్నారు. అధికారులు కార్మికులను వేధించడం మానుకోవాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం సీఐ టీయూ పోరాటాలు చేస్తుందన్నారు. అనంతర కాసిపేట 2గని నూతన పిట్ కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అనంతరం ఇతర యూనియన్‌ల నాయకులు సీఐటీ యూలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, అల్లి రాజేం దర్, సంజీవ్, భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి, ఏప్రిల్ 27: మేడేను శ్రామికవర్గం విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీఎం కార్యాలయంలో ఆవరణలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల వెంకన్న ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్, సురేష్, అశోక్, కనకలక్ష్మి, రాధా, సరోజన, పద్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: సింగరేణికాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయు- ఐఎఫ్‌టీయు) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద మేడే పోస్టర్లు ఆవిష్కరించారు. వెంకన్న, సురేష్, రాజుష్, రాంబాబు, కవిత, మల్లేశ్వరి, శిరీష తదితరులున్నారు.

మూడు నెలల జీతం ఇన్‌కంటాక్స్‌కే..

- ఆదాయపు పన్ను మినహాయింపు ఎన్నికల హామీయేనా..? ఎంపీ అభ్యర్థుల ముందు కార్మికుల డిమాండ్



సింగరేణి గని కార్మికులు(ఫైల్)

గోదావరిఖని, ఏప్రిల్ 27: బొగ్గు బావుల్లో ప్రాణాలకు తెగించి పని చేస్తున్న సింగరేణి గని కార్మికుల సంపాదనలో సగం మళ్లీ ప్రభుత్వమే గుంజుకుంటున్నది. మూడు నెలల జీతం ప్రతి కార్మికుడి నుంచి ఆదాయపు పన్ను రూపంలో ముందే కట్ అయిపోతున్నది. కష్టం చేసి సంపాదించిన సొమ్మంతా ఆదాయ పన్నుకే పోతే జీతం పెరుగుడెందుకు... బోనస్ వచ్చుడెందుకు... మొత్తం ఇన్‌కంటాక్స్‌కు కట్ కావడం ఎందుకు.. అని కార్మికవర్గం బెంబేలెత్తుతున్నది. 10వ వేజ్‌బోర్డు ఏర్పడిన తరువాత గని కార్మికుల జీతాలు చాలా పెరిగాయి. అందుకు సంతోషించాల్సిన కార్మికులు ఇప్పుడు బాధపడుతున్నారు. వేతనాలు పెరగడంతో ఆదాయపు పన్ను స్లాబ్‌ల్లో తేడాలు వచ్చి ఊహించలేనంత ఆదాయపు పన్ను కట్ అవుతున్నది. దీనికి తోడు దసరా, దీపావళి, లాభాల వాటా, తదితర బోనస్‌లు కలువడంతో కార్మికుల ఆర్థిక రాబడి పెరిగింది. ఇదే దామాషాలో ఇన్‌కంటాక్స్ పెరిగింది. సింగరేణిలో మూడు నెలలకోసారి స్లాబ్ ప్రకారం ఇన్‌కంటాక్స్ క్రింద వేతనంలో కోతలవుతున్నాయి. ఇప్పుడున్న 40వేల మంది సింగరేణి కార్మికుల నుంచి ఏడాదికి సుమారు రూ.1000కోట్ల నుంచి 1200కోట్ల రూపాయలు ఆదాయపు పన్ను చెల్లింపులు జరుగుతున్నాయి. ఆదాయ పన్ను మినహాయింపునకు సంబంధించిన ఎన్ని మార్గాలను వెతికినా కార్మికుడు ఇన్‌కంటాక్స్ భారం నుంచి బయట పడడం లేదు. సరాసరిగా ఒక్కొక్క కార్మికుడికి 3 మాసాల వేతనం ఆదాయపు పన్ను క్రింద కట్ అవుతున్నది. దీంతో కార్మికులు జీతం అదనంగా వచ్చే ప్లేడేలు, ఓటీలు, పీహెచ్‌డీ లాంటి అదనపు డ్యూటీలను చేయకుండా వదిలేస్తున్నారు. గతంలో వీటి కోసం ఎంతో తాపత్రయ పడే కార్మికులు ఇప్పుడు తమకు ఇవేవి వద్దు అంటున్నారు. దీంతో సింగరేణి ఉత్పత్తి మీద కూడా కొంత ప్రభావం పడుతున్నది.

ఇదిలా ఉండగా బొగ్గుగని కార్మికులకు భారత సైనికుల్లాగా ఆదాయపు పన్ను మినహాయింపు ఉండాలని నాలుగు దశాబ్దాలుగా డిమాండ్ ఉన్నది. ప్రతి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భాల్లో సింగరేణి కార్మికులకు ఇన్‌కంటాక్స్ రద్దు చేయిస్తామని అన్నీ రాజకీయ పార్టీలు, ఆ పార్టీల అభ్యర్థులు చెబుతున్నారు. కొందరు తమ మేనిఫెస్టోల్లో కూడా ఈ అంశాన్ని చేర్చారు. ఇక సింగరేణి గుర్తింపుసంఘం ఎన్నికల్లో ఇన్‌కంటాక్స్ మినహాయింపు అంశం మామూలుగానే మారిపోయింది. ఈ డిమాండ్‌పై బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో అసెంబ్లీలో సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. కానీ ఇప్పటికీ ఇన్‌కంటాక్స్ మినహాయింపుపై ఎలాంటి ముందడుగు పడలేదు. సింగరేణి సంస్థ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం 49శాతం వాటా ప్రకారం సుమారు రూ.3500కోట్లు రాయల్టీ, సేల్స్ ట్యాక్స్ తదితర రూపాల్లో సింగరేణి సంస్థ చెల్లిస్తుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి 51శాతం వాటా చొప్పున సుమారు రూ.4వేల కోట్లు సింగరేణి నుంచి చెల్లింపులు జరుగుతాయి. రెండు ప్రభుత్వాలకు ప్రతి సంవత్సరం సింగరేణి సుమారు 7వేల కోట్లకు పైగా వివిధ పన్నుల రూపంలో చెల్లిస్తుంది. కేవలం వెయ్యి కోట్ల రూపాయల ఇన్‌కంటాక్స్ రద్దు విషయంలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికులపై చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదు. లాభాల వాటాలు, బోనస్‌ల రూపంలో రాజకీయ వాగ్దానాలను చేసి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న పార్టీలు కార్మికుడికి శాశ్వతమైన ప్రయోజనం ఇన్‌కంటాక్స్ రద్దుపై మాత్రం చిత్తశుద్ధి కనబర్చడం లేదు. ఈ అంశం ఇప్పుడు మళ్లీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో తెరమీదికి వచ్చింది. ఖమ్మం, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ఫలితాలను నిర్దేశించగల సింగరేణి కార్మికవర్గం ఇప్పటి ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీలను, అభ్యర్థులను సూటిగా ప్రశ్నిస్తున్నాయి. ఇన్‌కంటాక్స్ రద్దు విషయం తేల్చండి అనేది కార్మికుల డిమాండ్‌గా మారింది.

మరో అంశం సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ. సింగరేణి పరిధిలోని సత్తుపల్లి, కోయగూడెం, కేకే6(మందమర్రి), శ్రావణపల్లి బొగ్గు బావులను ఓపెన్ మార్కెట్‌లో పెట్టి ప్రైవేటీకరించేందుకు ప్రయత్నించిన కేంద్ర ప్రభుత్వంపై కార్మికవర్గం తిరగబడింది. నాలుగేళ్ల క్రితం వచ్చిన ఈ ప్రతిపాదనను సింగరేణి కార్మికవర్గం, సంఘాలు అనేక పోరాటాల ద్వారా తిప్పికొట్టాయి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ నాలుగు బ్లాకులకు ఇప్పటికీ మూడుసార్లు టెండర్లు పిలిచింది. సత్తుపల్లికి మాత్రమే టెండర్లు దాఖలు కావడంతో సాంకేతిక కారణాలతో ఆ టెండర్ కూడా వాయిదా పడుతూ వచ్చింది. సింగరేణిలో ఉన్న వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ సంస్థలు కూడా బొగ్గు బ్లాకుల టెండర్లలో ఆసక్తిగా పాల్గొనడం లేదు. ఈ బొగ్గుబ్లాకులను సింగరేణికే కేటాయించాలనేది సార్వత్రిక డిమాండ్. ఆదాయపు పన్ను రద్దు, బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ అంశాలపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి గనుక ఈ ఎన్నికల సందర్భంగా కార్మికవర్గం అన్నీ పార్టీలు, అన్నీ పార్టీల అభ్యర్థుల నుంచి ఈ రెండు అంశాలపై స్పష్టమైన వైఖరిని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయంపై అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సానుకూలత వ్యక్తం చేసినప్పటికీ ఎన్నికల తరువాత ఈ డిమాండ్లను మరుగున పడవేస్తున్నాయి. ఈ ఎన్నికల సందర్భంలో తమకు స్పష్టమైన హామి ఇవ్వాలని సింగరేణి కార్మికవర్గం డిమాండ్ చేస్తున్నది.

ఓపెన్ డిగ్రీ సెమిస్టర్ ఫీజు చెల్లించండి

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్27: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు మే6లోపు చెల్లించాలని గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ జీ.సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.150 చొప్పున, బీకాం కంప్యూటర్, బీఎస్సీ సైన్స్ విద్యార్థులు అదనంగా ల్యాబ్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఫీజును టీఎస్ ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాల్లో చెల్లించాలన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు మే 26 నుంచి జూన్1 వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

ఘనంగా క్రిసెంట్ పాఠశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 27: కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి, పెగడపల్లిలోని క్రిసెంట్ ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో ఆదివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ సయ్యద్ వాజహతుల్లా ఆయాజ్, సీఈవో సయ్యద్ తాహిబిలాల్, హెచ్ఎం సయ్యద్ నసీర్, మాజీ ఉపసర్పంచ్ సూదాటి కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

'మాదిగలను మోసం చేసిన పార్టీలకు బుద్ధి చెప్పాలి'

మంథని, ఏప్రిల్ 27: మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో మాదిగలంతా బుద్ధి చెప్పాలని స్వతంత్ర అభ్యర్థి కొంకటి లింగమూర్తి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అన్ని పార్టీలు మాదిగలను మోసం చేశాయన్నారు. ఇప్పటి వరకు అన్ని పార్టీలు హామీలు ఇవ్వడం తప్ప అమలు చర్యలు తీసుకోలేదన్నారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలకు ఓటు మాదిగలంతా సమాధానం చెప్పాలన్నారు. తనను గెలిపిస్తే మాదిగలతో పాటు అన్ని వర్గాల వారికి సేవ చేయడం తోపాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

వైభవంగా చతుర్థి వేడుకలు

మంథని, మార్చి 27: స్థానిక మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో చుతుర్థి వేడుకలను భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని శ్రీమహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ అవరణ భక్తులతో సందడి గా మారింది.

ఈజీఎస్ కూలీలకు మందుల పంపిణీ

కమాన్‌పూర్, ఏప్రిల్ 27: కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలకు శనివారం లైన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణకు హోమియా మందు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హోమియా డాక్టర్ రమేష్‌బాబు ఉపాధి హామీ కూలీలకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ సానా రామకృష్ణారెడ్డి, కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చొడవరపు లింగమూర్తి, వార్డు మెంబర్ గసిగంటి అజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్యాల కుమార్‌లు ఉన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 27: పేదింటి అమ్మాయి పెళ్లికి ఆర్ష ఫౌండేషన్, పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థలు చేయూతగా నిలిచాయి. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని 30వ డివిజన్‌కు చెందిన చిలుముల శాంత-రాయమల్లు కూతురు వివాహానికి ఆర్షఫౌండేషన్, హైదరాబాద్‌కు చెందిన పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థ రూ25వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశాయి. కార్యక్రమంలో దయానంద్‌గాంధీ, డ్యాన్స్ మాస్టర్ సర్వేష్, ప్రవీణ్, సంతోష్ హర్ష, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు షేక్ హజ్రత్‌పాషా, బూడిద హర్ష పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో కాలనీ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అయిమన్ అయాజ్

ఫైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్27: ఎంబీబీఎస్‌లో కాలనీకి చెందిన అయిమన్ అయాజ్ గోల్డ్‌మెడల్ సాధించింది. రాష్ట్రంలోని మెడికల్ కాలజీలవారిగా ఎక్కువ మార్కులు పొందిన వారికి తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ పతకాలను బహూకరించింది. శనివారం గాంధీ మెడికల్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ ఆమెకు గోల్డ్‌మెడల్‌ను బహూకరించింది. అయిమన్ అయాజ్ హైదరాబాద్‌లోని అయాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసి కాలేజీలో అత్యధిక మార్కులు సాధించింది. అయిమన్ అయాజ్ తండ్రి అయాజుద్దీన్ ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లె గనిలో హెడ్ ఓవర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు.

కరపత్రాల ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 27: మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య పిలుపునిచ్చారు. శనివారం కరపత్రాలు ఆవిష్కరించిన అనంతరం కొమురయ్య మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం అత్యంత పాసిస్టు పాలన కొనసాగిస్తూ ప్రజల మధ్య అంతరాలు సృష్టించిందన్నారు. దేశ సంపదను కొద్దిమంది కార్పోరేట్ శక్తుల్లో కేంద్రీకరించే విధంగా మోడీ ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని, మూడోసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని సైతం మారుస్తామని బాహటంగానే బీజేపీ నేతలు మాట్లాడుతున్నారన్నారు. ఆదివారం 2 గంటల నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే సదస్సును అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, సంపత్, ధీరజ్, సురేష్ కళ్యాణ్ .పాల్గొన్నారు

'ప్రజల ఆరోగ్యంతో వ్యాపారుల చెలగాటం'

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 27: జిల్లాలోని గోదావరిఖని, పలు ప్రాంతాల్లో కొంత మంది వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా విషపూరితమైన రంగు రంగులతో పండ్లను మెరిసే విధంగా చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటికైనా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ వ్యాపారులపై దాడులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని అధికారులను కోరారు.

నిబంధనలు పాటించని లాడ్జిలను సీజ్ చేయాలి

-ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య

కోల్‌సిటీ, ఏప్రిల్ 27: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిన లాడ్జిలను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య పోలీసులను కోరారు. ఎన్‌టీపీసీలోని ఓ హోటల్ పేకాటకు స్థావరంగా మారడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని ఆరోపించారు. పేకాట కోసం పెద్ద పెద్ద హోటళ్లు నిర్మిస్తూ దర్జాగా పేకాట ఆడిస్తున్నారని, ఇందులో యువత ఎక్కువ మంది ఉంటున్నారని చెప్పారు. గతంలో కూడా సదరు హోటల్‌లో పేకాట ఆడుతూ పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. పేకాట స్థావరాలుగా మారిన లాడ్జిలను సీజ్ చేసి నిర్వాహకులపై పీడీయాక్టు నమోదు చేయాలని ఆయన పోలీస్ ఉన్నతాధికారులను కోరారు.